క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్‌లతో పాటు నెమలినగర్ ఫీడర్‌లోను ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నేడు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు

రాజేంద్రనగర్: కులమత బేధాలకు అతీతంగా సమాజ చైతన్యానికి కృషి చేసిన వ్యక్తి సావిత్రీబాయి పూలే అని రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు రఘుగౌడ్ అన్నారు. మంగళవారం సంఘ సంస్కర్త, ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రీభాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8.30 గంటలకు రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల ఆవరణలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బహుళ అంచెల సాగు లాభదాయకం

- స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో సాగుపై రైతులకు శిక్షణ

శంషాబాద్ రూరల్: లాభసాటి వ్యవసాయానికి బహుళ అంచెల సాగు దోహదపడుతుందని సాగు రూపకర్త ఆకాష్ చౌరాసియా అన్నారు. ముచ్చింతల్ సమీపంలోని స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుళ అంచెల సాగు విధానంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తక్కువ స్థలంలో ఎక్కువ రకాల పంటలను సాగు చేసుకోవడానికి బహుళ అంచెల సాగుతో సాధ్యపడుతుందన్నారు. దీర్ఘకాలిక పంటల్లో అంతర పంటలుగా స్వల్పకాలిక పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఈ విధానంతో చీడపీడల నివారణతో పాటు మొక్కలకు సరైన పోషకాలు అందుతాయన్నారు. సేంద్రీయ పద్ధతిలో ఈ విధానంలో సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. సన్న, చిన్నకారు రైతులే కాకుండా వంద గజాల విస్తీర్ణం పైగా ఉన్న స్థలాల్లో కూడా ఈ విధానంలో సాగు చేపట్టవచ్చన్నారు. ట్రస్టు సీఈఓ డీవీఎస్.రావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న లింగం సుధాకర్‌రెడ్డి

బండ్లగూడ: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని విద్యా భారతి దక్షిణ మధ్యక్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. గోవాలో జరిగిన బ్యాడ్మింటన్(డబుల్)లో విద్యారణ్య ఆవాస విద్యాలయం విద్యార్థులు హేమంత్, గణేష్‌లు విన్నర్స్‌గా నిలిచారు. అదే విధంగా భాగ్యనగర్ విభాగ్ స్థాయిలో ఖోఖో, కబడ్డీలో విద్యారణ్య ఆవాస విద్యాలయం విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన విజేతలను అభినందించి మెడల్స్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యారణ్య ఆవాస విద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలన్నారు. భవిష్యత్‌లో దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. నిత్యసాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ విభాగ్ సహ కార్యదర్శి మధుసూదనగుప్తా, ఆవాస విద్యాలయ కార్యదర్శి బొద్దు శ్రీనివాస్, ప్రబంధకారిని సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ప్రధాచార్యులు రామోజు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ పాత్ర కీలకం

గోల్కొండ: బీఆర్ఎస్ ఇక్కడి రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయం చూరగొనడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ అన్నారు. భారతీయ సేవక్ వారి వాల్ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ కీలకపాత్ర పోషించడం ఖాయమని అన్నారు. భారతీయ సేవక్ జాతీయ అధ్యక్షుడు ఫయాజుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొంతకాలంగా తెలంగాణ సేవక్ పేదలకు అండగా నిలిచిందని అన్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారిన సందర్భంగా తెలంగాణ సేవక్‌గా మార్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహ్మద్ ఇంతియాజ్ ఉద్దీన్ అహ్మద్, అక్బర్ బిన్ మొహసన్, ఎండీ అసద్ ఉద్దీన్ తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

రాజేంద్రనగర్ జోన్ బృందం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు క్యూ కట్టారు. వైకుంఠ ద్వారాల ద్వారా స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాజేంద్రనగర్, ప్రేమావతిపేట, శివరాంపల్లి, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లి, రాంబాగ్, హైదర్‌గూడ, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, పాండురంగానగర్ ప్రాంతాల్లోని దేవాలయాలను వివిధ రకాల పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు దేవాలయాల్లో వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. సాయంత్రం దేవాలయాల వద్ద స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రేమావతిపేటలో...









స్వామి వారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు







ప్రత్యేక అలంకారంలో మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి , సహస్రనామార్చన చేస్తున్న మహిళలు, పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి ఆలయంలో

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ్ అన్నారు. ఇందిరాపార్కు సర్పంచ్‌ల నిధులు, విధులు సర్పంచ్‌లకు పూర్తి స్థాయి అధికారులు కల్పించాలని పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్‌ల హక్కుల కోసం ఉద్యమ బాట పట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ సర్పంచ్‌ల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుండగా అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడుతుందన్నారు. పోలీసులు సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టైన వారిలో ఈ–బ్లాక్ ఉద్యోగులు మహ్మద్ కాలేజ్, ఉపాధ్యక్షులు బొద్దు ఓంప్రకాష్, సెక్రటరీ సి.రవీందర్‌రెడ్డి, యువ నాయకుడు బట్టు కిరణ్, మైనార్టీ నాయకులు మహ్మద్ ఖాదర్ తదితరులు ఉన్నారు.



మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ కాంగ్రెస్ నాయకులు

కేలండర్ ఆవిష్కరణ



విజయ గణపతి దేవాలయ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ విజయగణపతి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంతోషి రాజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, చైర్మన్ టి.శ్రీధర్, కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి రవికుమార్, కోశాధికారి నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు లక్ష్మినారాయణ, పెంటారెడ్డి, మాజీ కార్యదర్శి రామచంద్రయ్యగుప్తా, మాజీ కోశాధికారి వి.సురేందర్, పూర్ణచంద్రరావు, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన



బెకర్స్ న్యూట్రి హబ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ఆరోగ్యవంతమైన జీవనానికి చిరుధాన్యాలు అవసరమని ప్రతి ఒక్కరు చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్ అన్నారు. అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన బెకర్స్ న్యూట్రిహబ్‌ను రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2023ను మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించిందన్నారు. రైతులు ప్రతి ఒక్కరు తప్పని సరిగా చిరుధాన్యాల పంటల సాగు వాటి ఉత్పత్తి పై దృష్టి సారించాలని కోరారు.మిల్లెట్స్ ఉత్పత్తుల వ్యాపారానికి సంబంధించి పలువురు ఎంటర్ ప్రెన్యూర్స్ తమ అనుభవాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డాక్టర్ సీమ, డాక్టర్ జె.సత్యనారాయణ, డాక్టర్ అనిత, రవికుమార్, రమేష్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ ఉద్యోగుల సంఘం నూతన కేలండర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, వర్సిటీ బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్కు సందర్శన





కొత్వాల్‌గూడలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్కును పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: కొత్వాల్‌గూడలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్కును సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ పరిశీలించారు. కార్పొరేషన్ అధికారులతో కలిసి రిసోర్స్ పార్కును సందర్శించి చేపడుతున్న పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్, ఎస్ఈ శివనంద్, డీఈ యాదయ్య, ఏఈ రాజీవ్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అడిగినంత ఇవ్వకుంటే అదనపు వడ్డింపు..


- టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సిబ్బంది అక్రమాలు
- ఉప కమిషనర్‌కు ఫిర్యాదు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో బిల్డింగ్ పర్మిషన్‌లకు అడిగినంత ఇవ్వకుంటే కుంటి సాకులతో అనుమతులకు కొర్రి పెడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇక బిల్డర్ల ఫైళ్లకు అనేక కారణాలు చూపుతూ అనుమతులను ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బుద్వేల్‌కు చెందిన బిల్డర్ బిల్డింగ్ అనుమతుల కోసం టీస్ బి–పాస్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే గతంలో ఎల్ఆర్ఎస్ పథకంలో బుద్వేల్ 195 గజాల ప్లాటుకు దరఖాస్తు చేశాడు. ఇందులో భాగంగానే ఈ ప్లాట్‌ను విడదీసి 100 గజాలు, 95 గజాలు చొప్పున బిల్డింగ్ పర్మిషన్ కోసం వేరువేరుగా దరఖాస్తు చేశాడు. కాగా వంద గజాలకు రూ.1.20 లక్షలు, 95 గజాలకు రూ.1.15 లక్షలు చెల్లించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారన్నారు. వాస్తవానికి రూ.1.55 లక్షలు చెల్లించాలని నిబంధనలు ఉన్నాయి. అయితే టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తూ అందుకు అంగీకరించనందున బిల్డింగ్ పర్మిషన్‌కు రెట్టింపు నగదును వసూలు చేస్తున్నట్లు బిల్డర్ రాజు గోపాల్ తెలిపారు. అదే ప్రాంతంలో 173 గజాలు కలిగిన ప్లాటుకు రూ.2,35,728 రూపాయలు ఫీజు చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఏసీపీ అడిగినంత ఇవ్వనందుకే తమకు అదనపు చార్జీలు చెల్లించాలని చెబుతున్నారని ఆరోపించాడు.

ఇప్పటికైనా నిబంధనల ప్రకారం అధికారులు ఫీజు కట్టించుకుని అనుమతి మంజూరు చేయాలని కోరుతున్నారు. సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఉపకమీషనర్ జగన్‌కు ఫిర్యాదు చేశారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ

రాజేంద్రనగర్: అయ్యప్ప స్వామి నామస్మరణతో రాజేంద్రనగర్‌లోని గాంధీనగర్ మారుమోగింది. సోమవారం వెంకటేష్‌యాదవ్ అయ్యప్ప స్వామి 18వ పడి పూజను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, రాజేంద్రనగర్ అసెంబ్లీ బీజేపీ పాలక్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, డి.సత్యనారాయణ, బొక్క బాల్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కేక్ కట్ చేస్తున్న రిజిస్ట్రార్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2023 నూతన సంవత్సరం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ బోధన,బోధనేతన సిబ్బంది సమష్టి కృషితో అనేక అంశాల్లో అగ్రగామిగా నిలిపామని ఇదే కృషిని రానున్న రోజుల్లోనూ కొనసాగించాలని కోరారు. 2023లో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మణికొండ: నూతన సంవత్సరం సందర్భంగా మణికొండ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ కేక్ కట్ చేసి కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, మేనేజర్ మల్లారెడ్డి, కౌన్సిలర్ లక్ష్మీ నారాయణ, పురుషోత్తం, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు యాలాల నరేష్, బిల్‌కలెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మణికొండ చైర్మన్, కమిషనర్, సిబ్బంది

వర్మి కంపోస్ట్ తయారీపై అవగాహన

మణికొండ: ప్రతి ఇంటి నుంచి సేకరించే తడి, పొడి చెత్తలతో తయారు చేస్తున్న వర్మి కంపోస్ట్ ఎరువులపై విద్యార్థులకు మణికొండ మున్సిపాలిటీలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటేషన్ ఇన్‌చార్జి సంపత్ మాట్లాడుతూ మన ఇంటి నుంచి బయటకు వచ్చే చెత్తను సైతం ఉపయోగకరంగా మార్చుకునే అవకాశం ఉందన్నారు. చాలా మంది మొక్కలను పెంచుతారని, వాటికి అవసరమైన ఎరువులను బయట కొనుగోలు చేస్తుంటారన్నారు. అలా కాకుండా మన ఇంట్లోనే రెండు కుండీలను ఏర్పాటు చేసుకుని తడి చెత్తతో వర్మికం పోస్టు ఎరువును తయారు చేసుకోవచ్చన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పెంచుతున్న పార్కులు, మొక్కలకు వర్మి కంపోస్టు ఎరువులనే వాడుతున్నామన్నారు. ఇంటి నుంచి చెత్తను సేకరించిన తర్వాత దాన్ని వేరు చేయటం, ఆరబెట్టడం, మక్కించటం, ఎరువుగా మార్చటాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో పాటు సినీ నటుడు శివబాలాజీ సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎంతో మంచి కార్యం చేస్తున్నారని, ప్రతి ఒక్కరు ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేసి అందించి తమ వంతుగా సహరించాలన్నారు. కార్యక్రమంలో గాయత్రి టెక్నో స్కూల్ విద్యార్థులతో పాటు డీఎఫ్ఓ హెజాస్ అహ్మద్, సూపర్‌వైజర్‌లు సాజిద్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్మికం పోస్టు ఎరువుల తయారీని తెలుసుకుంటున్న శివ బాలాజీ, విద్యార్థులు

శుభాకాంక్షలు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను సోమవారం శంషాబాద్ జోన్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు.
– శంషాబాద్



వానొస్తే మునకే...

- ఫాంల్యాండ్ ముసుగులో అక్రమ వెంచర్ నిర్మాణం
- వరద కాలువను పూడ్చి రోడ్ల ఏర్పాటు
- ఈసీవాగు పరివాహక ప్రాంతంలో జోరుగా సాగుతున్న అక్రమాలు
- పట్టించుకోని అధికారులు



ఈసీవాగు పక్కన జోరుగా సాగుతున్న రోడ్డు పనులు

శంషాబాద్ రూరల్: ఫాం ల్యాండ్ పేరుతో ఓ రియల్టర్ ఏకంగా వరదకాలువను పూడ్చి వెంచర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు.. హిమాయత్ సాగర్ జలాశయానికి వరదనీటిని తీసుకువచ్చే ఈసీవాగును ఆనుకుని ఉన్న పరివాహక ప్రదేశంలో రోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయి.. మండల పరిధిలోని మల్కారం రెవెన్యూలోని సర్వే నంబర్లు 75,78,79లో సుమారు పది ఎకరాల్లో ఈ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు.

వరద కాలువలో రోడ్డు..

కేబీ.దొడ్డి శివారులోని ఈసీవాగు ఈ సర్వే నంబర్ల వద్ద రెండుగా చీలుతుంది. ప్రధాన వాగుతో పాటు చీలికగా ఉన్న అంచెమడుగు నుంచి వరదనీరు పారుతుంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఇటీవల అంచెమడుగుపై భారీ కల్వర్టు కూడా నిర్మించారు. ప్రస్తుతం వెంచరు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ఉన్న అంచెమడుగు కాలువను గతంలోనే రియల్టర్లు పూడ్చి వేశారు. ఈ కాలువపై ప్రస్తుతం 30 అడుగులకు పైగా రోడ్డు వేస్తున్నారు.

ఆరు అడుగుల ఎత్తులో వరద..

వెంచరు ప్రాంతంలో వర్షా కాలంలో భారీగా వరద నీరు పారుతోంది. రెండేళ్లుగా ఇక్కడ దాదాపు ఆరు అడుగుల ఎత్తులో వరదనీరు చేరింది.

జనానికి టోపీ...

వాగు పరివాహక ప్రాంతంలో వెలుస్తున్న ఈ వెంచరులో ఫాంలాండ్ పేరుతో అమ్మకానికి పెట్టారు. వర్షాకాలంలో భారీగా వరదనీరు పారే ఈ ప్రాంతంలో కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. వానాకాలం వచ్చే వరకు ఇక్కడ వరద పారే అవకాశాలు లేకపోవడంతో అలోగా వెంచరు ఏర్పాటు చేసి అమ్మకాలు చేయడానికి రియల్టర్లు ముమ్మరంగా పనులు సాగిస్తున్నారు.

పెద్దలకు విందు భోజనం..

ఇక్కడ వెంచరులో పనులు చేపట్టడానికి ముందు రియల్టర్లు పక్కాగా స్కెచ్ వేశారు. తమ పరిచయాలను చూపుతూ జనం నెత్తి మీద టోపీ పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. 15 రోజుల ముందే ఇక్కడ ఉన్న ఫాం హౌస్‌లో యజ్ఞం పేరుతో నియోజవర్గ ప్రజాప్రతినిధి, పోలీసుల అధికారులతో పాటు కొందరు సినీ, మీడియా రంగాలకు చెందిన వారికి విందు ఏర్పాటు చేశారు. ఇక తనకు ఎదురు ఉండదని పనులు పెట్టారు.

వరదకు అడ్డంకి..

వాగు పరివాహక ప్రాంతంలో వెలుస్తున్న ఈ వెంచరులో రోడ్డు, నిర్మాణాలు చేపడితే వరదకు అడ్డంకిగా మారనుంది. ఎగువ భాగం నుంచి వచ్చే వరద ఇక్కడ ఆగిపోతే సమీపంలోని కేబీ.దొడ్డి గ్రామాన్ని ముంచెత్తుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నా పంచాయతీ, రెవెన్యూ, సాగునీటి శాఖ, జలమండలి అధికారులు కన్నెత్తి చూడడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



అంచె మడుగు కాలువలో వేస్తున్న రోడ్డు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

ఈ విషయమై సాగునీటి శాఖ ఏఈ మౌనికను వివరణ కోరగా త్వరలోనే వెంచర్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మా దృష్టికి రాలేదు

వాగు సమీపంలో పనులు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం . నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదు.
– శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్, శంషాబాద్